13 . 10. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

సోమవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 135 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## భైరందేవ్ విగ్రహ దివ్య ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే...

**బేల వెలుతురు అక్టోబర్ 12:**

సదల్పూర్ లోని బైరాందేవ్ ఆలయంలో వైభవంగా నూతన శ్రీ భైరందేవ్ విగ్రహ దివ్య ప్రతిష్టా మహోత్సవం ఆదివారం అత్యంత భక్తిశ్రద్దల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మరియు ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు అనంతరం. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని అన్నారు.

# నల్గొండలో గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే ఆయన వల్లే

- ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు ఖరారు
- తుంగతుర్తి సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నల్గొండకు గోదావరి జలాలు ఆయన చలవేనన్న సీఎం
- 24 గంటల్లోనే జీవో జారీ చేస్తామని వెల్లడి
- దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ
- ఆయన మృతికి సోనియా, ఖర్గే, రాహుల్ సంతాపం తెలిపారన్న సీఎం రేవంత్ రెడ్డి





**సూర్యాపేట వెలుతురు అక్టోబర్ 12:** తెలంగాణ దివంగత మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరుదైన గౌరవం ప్రకటించారు. ఆయన సేవలను చిరస్థాయిగా నిలిపేలా ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు 'రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రాజెక్టు'గా నామకరణం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు రానున్న 24 గంటల్లోనే అధికారికంగా జీవో (ప్రభుత్వ ఉత్తర్వు) జారీ చేస్తామని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఆదివారం నిర్వహించిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్మారక సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నల్గొండ గడ్డపై గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే అది కేవలం దామన్న ధైర్యం, పట్టుదల వల్లే సాధ్యమైంది. ఆయన ఒత్తిడితోనే నాటి ప్రభుత్వం ఎస్సారెస్పీ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లింది" అని గుర్తుచేశారు. తుంగతుర్తి ప్రజల అభివృద్ధి కోసం ఆర్డీఆర్ నిస్వార్థంగా పనిచేశారని సీఎం కొనియాడారు.

దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, అధిష్ఠానం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారని తెలిపారు. సోనియా గాంధీ స్వయంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారని వెల్లడించారు. ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీరతాయని, ఇది దామోదర్ రెడ్డి ఆశయాలకు దక్కే నిజమైన నివాళి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



## టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి

- పత్తి సేకరణపై రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు, వ్యవసాయ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష
- Kapas Kisan యాప్‌లో రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలి
- ప్రతి కొనుగోలు కేంద్రంలో ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్ నియమించాలి - మంత్రి తుమ్మల ఆదేశం

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులుతో మంత్రి తుమ్మల ఈరోజు చరవాణి ద్వారా పత్తి సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సీసీఐ

## ఖర్గేను పరామర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



న్యూఢిల్లీ వెలుతురు అక్టోబర్ 12: ఆఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం న్యూఢిల్లీ లో పరామర్శించారు.

ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నిర్మాణ రంగ వృద్ధి రేటు 11.97 శాతం

- సెప్టెంబర్ లో ఇళ్ల రిజిస్ట్రేషన్లలో 35 శాతం పెరుగుదల
- వ్యవసాయం తర్వాత రియల్ ఎస్టేట్ లోనే ఎక్కువ మందికి ఉపాధి
- రెండు, మూడు నెలల్లో 'ఏఐ' సిటీకి భూమి పూజ
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:** '2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం






వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్ డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది'

# ఎయిమ్స్ తరహాలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద

- త్వరలోనే మంజూరయ్యే అవకాశం
- ఇదే విషయాన్ని రాష్ట్ర వైద్య మంత్రికి కూడా తెలియజేశాను
- కేంద్రం వెనుకంజ వేస్తోందంటూ తప్పుడు ప్రచారం తగదు
- రాష్ట్రానికి కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోంది
- మోదీ ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలూ సమానమే
- తప్పుడు ప్రచారం, కథనాలతో గందరగోళం సృష్టిస్తే రాష్ట్రానికే నష్టం
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి
- కేంద్ర ఆయుష్ మంత్రికి రాసిన లేఖను విడుదల చేసిన బండి సంజయ్
- కరీంనగర్ లో ఆత్యాధునిక ఆయుష్ ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఏర్పాటుపై ఎందుకు స్పందించడం లేదు?
- దామోదర రాజనర్సింహకు రాసిన లేఖను విడుదల చేసిన కేంద్ర మంత్రి



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 12:** ఆయుర్వేదం ఏర్పాటులో కేంద్రం వెనుకంజ వేస్తోందని, దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేస్తోందంటూ మీడియా వస్తున్న కథనాలను కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఇలాంటి సమాచారం లీకులిస్తూ కేంద్రంపై బురద చల్లేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలూ, ప్రాంతాలూ సమానమేనని స్పష్టం చేశారు. ఎయిమ్స్ తరహాలో తెలంగాణలోనూ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ను స్థాపించాలని కోరుతూ ఇప్పటికే తాను కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా ఉందని, త్వరలోనే మంజూరయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదివారం మీడియాకు ఒక ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు సైతం సమాచారమిచ్చినట్లు పేర్కొన్నారు. ఆయుర్వేద ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ కు రాసిన లేఖను ఈ సందర్భంగా మీడియాకు విడుదల చేశారు. అదే విధంగా కరీంనగర్ లో అత్యాధిక ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ దామోదర రాజనర్సింహకు తాను 4 నెలల క్రితమే (మే 27, 2025) లేఖ రాశానని, కానీ ఇప్పటి వరకు దీనిపై నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు. ఇప్పటికీ రాష్ట్ర మంత్రి పేషీలోనే పెండింగ్ లో ఉందని పేర్కొన్నారు. దామోదర రాజనర్సింహకు రాసిన లేఖను సైతం కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు విడుదల చేశారు.

## 4,092 గురుకుల ఉద్యోగుల సేవల పునరుద్ధరణ

- ఉద్యోగుల కష్టాన్ని గుర్తించిన ప్రజా ప్రభుత్వం
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:** గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగుల సేవల కొనసాగింపునకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కి అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల విద్యా వ్యవస్థ పై తమ

## తెలంగాణలో బీసీల ఐక్య గళం

- 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జేఏసీ ఏర్పాటు...
- చైర్మన్ గా ఆర్.కృష్ణయ్య
- న్యాయం కోసం ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు
- చట్టసభల్లో బిల్లు పెట్టేవరకు పోరాటం ఆగదని కృష్ణయ్య స్పష్టీకరణ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:** తెలంగాణలో వెనుకబడిన తరగతుల (బీసీ) హక్కుల సాధన ఉద్యమం కొత్త రూపు సంతరించుకుంది. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లను సాధించడమే ఏకైక లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి 'తెలంగాణ



# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

- రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్,
- జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో, బుల్డోజర్ కావాలో తేల్చుకోవాలన్న కేటీఆర్
- కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణ,
- రెండేళ్లలో రూ. 2.80 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శ,
- ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న కేటీఆర్,
- ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పిలుపు,
- బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీ అని ఎద్దేవా

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను

## నకిలీ మద్యం నిగ్గు తేల్చేందుకు 'సిట్' ప్రకటించిన సీఎం చంద్రబాబు

- ఐపీఎస్ అధికారి జీవీజీ అశోక్ కుమార్ నేతృత్వంలో దర్యాప్తు
- సభ్యులుగా ముగ్గురు ఐపీఎస్ అధికారులు, ఎక్సైజ్ నిపుణుడు
- నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ప్రత్యేక యాప్ ఆవిష్కరణ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 12:** రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టిస్తున్న ములకలచెరువు నకిలీ మద్యం వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి, ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఈ

# టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి

ఆహ్వానించిన టెండర్లును 10.10.2025న ఓపెన్ చేసినట్లు, వాటిలో మొత్తం 328 జిన్నింగ్ మిల్లులు పాల్గొన్నాయని, టెక్నికల్ టెండర్లు నిన్నటికి పూర్తయ్యాయని మార్కెటింగ్ శాఖల అధికారులు మంత్రిగారికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ, టెండర్ల ప్రక్రియ పూర్తవ్వగానే సంబంధిత జిన్నింగ్ మిల్లుల జాబితాను జిల్లా కలెక్టర్లకు తెలియజేయాలని, తరువాత ఆయా మిల్లులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పత్తి కొనుగోలు కార్యకలాపాల కోసం సీసీఐ ప్రవేశపెట్టిన "కాపాస్ కిసాన్ " యాప్ ద్వారా రైతులు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు వివరించగా, రైతులు నమోదు సమయంలో ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రివర్యులు సూచించారు. కొంతమంది రైతులు మొబైల్ నంబర్లు మార్చిన కారణంగా యాప్‌లో లాగిన్ కావడంలో సమస్యలు ఎదుర్కొనే అవకాశముందని మంత్రివర్యులు పేర్కొనగా దానికి డైరెక్టర్ వ్యవసాయ శాఖ సమాధానం ఇస్తూ ఆధార్ నంబర్ ం ఓటీపీ ద్వారా లాగిన్ చేసే అవకాశం కల్పించాలని, అలాగే డేటాబేస్‌లో లేని రైతులకు కొత్త రిజిస్ట్రేషన్ సదుపాయం ఇవ్వాలని సీసీఐ అధికారులను కోరినట్లు మంత్రి గారికి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయశాఖ అధికారులకు కాపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్, కౌలు రైతుల నమోదు ప్రక్రియపై శిక్షణా కార్యక్రమాలు సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 8 వరకు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. అలాగే రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్-ఫ్రీ నంబర్ 1800 599 5779 ఏర్పాటు చేసి, ఉదయం 7.00 గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు రైతుల ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు వివరించారు. మంత్రివర్యులు మాట్లాడుతూ కాపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతుల నమోదు ప్రక్రియ మొదటిసారిగా చేపడుతున్నందున, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి కొనుగోలు కేంద్రంలో ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించి, రైతులకు యాప్ ద్వారా నమోదు చేసే విధానం పై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## నిర్మాణ రంగ వృద్ధి రేటు 11.97 శాతం

అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలెప్ మెంట్ కౌన్సిల్(నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్ లో నిర్వహిస్తున్న '15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో'లో ఆయన ఆదివారం పాల్గొని ప్రసంగించారు. 'హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్ లో రూ.2820 కోట్ల విలువైన 4903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ లో రూ.4804 కోట్ల విలువైన 6612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇది 35 శాతం అధికం. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయ్యింది. ఇవి కేవలం గణాంకాలు కాదు... రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానాలు' అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'ఈ సెప్టెంబర్ లో రూ.కోటిపైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం పెరుగుదల ఉంది. మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతం' అని చెప్పారు. 'భారత్ లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే... అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 శాతం 15 శాతం కాగా... చైనాలో అత్యధికంగా 23 శాతం నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది 6 శాతం నుంచి 8 శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంది' అని అభిప్రాయపడ్డారు. 'ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ %-% 2, భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి. డిసెంబర్ నాటికి 'ఫ్యూచర్ సిటీ'లో జోనలైజేషన్ ప్రక్రియను పట్టాలెక్కించాలనే పట్టుదలతో ఉన్నాం. అక్కడే 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఏఐ సిటీకి రెండు, మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం' అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి మేక, కాళీ ప్రసాద్ దామెర, డా.లయన్ కిరణ్, కె.శ్రీధర్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 4,092 గురుకుల ఉద్యోగుల సేవల పునరుద్ధరణ

ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి ప్రశంసనీయమని మంత్రి కొనియాడారు. ఉద్యోగుల సేవలను గుర్తించి వారికీ న్యాయం చేయాలనే మానవతా దృక్పథం ఈ ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కాంట్రాక్ట్ పద్ధతిలో 2, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 1,545, పార్ట్‌టైమ్ విధానంలో 2,102, హానరేరియం పద్ధతిలో 443 మొత్తం 4,092 మంది ఉద్యోగుల సేవలు పునరుద్ధరించబడ్డాయనీ పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం.1533 ప్రకారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (%ు+ూఔ=జు×ూ%) పరిధిలో పనిచేస్తున్న 4,092 మంది ఉద్యోగుల సేవలను మరో ఏడాది పాటు కొనసా గించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో వేతనాల చెల్లింపులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది కుటుంబాలకు భారీ ఊరట కలగనుందని మంత్రి పేర్కొన్నారు. గత కొన్నినెలలుగా కంటిన్యూషన్ ఆర్డర్లు లేకపోవడంతో వేతనాల చెల్లింపులో సాంకేతిక ఆటంకాలు తలెత్తి, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మంత్రి గుర్తుచేశారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల సేవాభావాన్ని గుర్తించి, వారి సేవలను కొనసాగిస్తూ జి.ఓ. 1533 జారీ చేయడం ద్వారా మానవతా దృక్పథాన్ని చూపిందని తెలిపారు. ఇకపై ప్రతి నెలా వేతనాలు సకాలంలో చెల్లింపుకు మార్గం సుగమమవుతుందని, ఉద్యోగులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ సేవలను కొనసాగిస్తారని ఆయన స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం వలన వేలాది కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది. గురుకుల విద్యాసంస్థల్లో సేవలందిస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారనీ తెలిపారు గురుకుల విద్యా వ్యవస్థను బాధ్యతతో ముందుకు తీసుకెళ్లేందుకు భరోసాను అందిస్తుందన్నారు" ప్రభుత్వం విద్యా వ్యవస్థ, గురుకుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉజ్వల భవిష్యత్తును అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. "ఇది కేవలం పరిపాలనా నిర్ణయం కాదు . ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపే ప్రజా సంకల్పం" అని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రిగ %ు+ూఔ=జు×ూ% ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. గురుకుల ఉద్యోగుల సేవాభావం ప్రభుత్వానికి ఆదర్శం. ప్రజా సంకల్పానికి ప్రతిబింబమే ఈ జి.ఓ." అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఈ పునరుద్ధరణ 01.04.2025 నుండి 31.03.2026 వరకు అమల్లో వుంటుంది.

# తెలంగాణలో బీసీల ఐక్య గళం

బీసీ జేఏసీ' (జాయింట్ యాక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేశాయి. ఈ ఐక్య కార్యాచరణ కమిటీకి చైర్మన్‌గా సీనియర్ నేత ఆర్. కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా వీజీ నారగోని ఏకగ్రీవంగా నియమితులయ్యారు. వీరితో పాటు మరో ఆరుగురు కీలక సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై కోర్టు ఏ కారణంతో స్టే ఇచ్చిందో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక స్టే ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. బీసీలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు ఆయన పిలుపునిచ్చారు. "గత 76 ఏళ్లుగా బీసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పుడు దానికి అవమానం కూడా తోడైంది. మా హక్కుల కోసం చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టే వరకు ఈ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదు" అని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే కేంద్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి పెరుగుతుందని ఆయన అన్నారు. బీసీ సమాజం ఐక్యంగా నిలబడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎయిమ్స్ తరహాలో ఆలిండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద

తెలంగాణలో సాంప్రదాయ ఆయుష్ వైద్యసేవలు, విద్యా అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. "ఆయుర్వేద చికిత్సలపై స్థానికంగా మంచి డిమాండ్ ఉన్నప్పటికీ, సంస్థాగత స్థాయిలో ఆయుర్వేద సేవలు లభ్యం కావడం లేదు. ఆసుపత్రికి అనుబంధంగా ఉండే కళాశాల ఏర్పడితే ప్రజలకు ఆయుర్వేద చికిత్సలను మరింతగా అందుబాటులోకి తీసుకురావొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అర్హత కలిగిన ఆయుర్వేద వైద్యులు, నిపుణులు కొరత ఉంది. కొత్త కళాశాల ఏర్పాటు ద్వారా నూతన తరానికి శిక్షణ కల్పించడమే కాకుండా, స్థానిక ఆరోగ్య వ్యవస్థ బలపడుతుంది. దీనికితోడు ఆయుర్వేద విద్యను అభ్యసించాలంటే తెలంగాణ విద్యార్థులు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. స్థానికంగా కళాశాలను ఏర్పాటు చేయడంవల్ల వారికి అందుబాటు ధరల్లోనూ విద్యా అవకాశాలు లభిస్తాయి"అని తెలిపారు.

తెలంగాణలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద స్థాపనవల్ల రాష్ట్రానికి అనేక రకాలుగా ప్రయోజనాలు చేకూరనుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. అధిక ప్రమాణాల ఆయుర్వేద వైద్య సేవలను అందించడం ద్వారా, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించినట్లు భారతీయ సాంప్రదాయ వైద్య విద్యా పరిశోధనలను అభివృద్ధి చేయడం ద్వారా, ఉపాధి అవకాశాలు సృష్టించడం మరియు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. తాను ఈ అంశాలను ప్రస్తావిస్తూ కేంద్ర ఆయుష్ మంత్రికి ఇటీవల లేఖ రాశానని, కేంద్రం కూడా సానుకూలంగా స్పందించిందని తెలిపారు. అతి త్వరలోనే ఢిల్లీ, రాజస్తాన్, హర్యానా, గోవా తరహాలోనే తెలంగాణలోనూ ఆలిండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద మంజూరయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం అన్ని విధాలా సహకరిస్తోందని, ఈ తరుణంలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించవద్దని కోరారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

హామీలన్నీ మోసమే...!

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు.

బీజేపీపైనా విమర్శలు

ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

# సౌదీ నుంచి హైదరాబాద్ కు కోమా పెషేంట్

**- మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ**

**- 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' సమన్వయం**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**
గత ఎనభై రోజులుగా, సౌదీ అరేబియా రాజధాని రియాద్ లో చికిత్స పొందుతున్న కోమా పెషేంట్ లోకిని క్రిష్ణమూర్తిని హైదరాబాద్ కు తరలించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో సౌదీ ఎయిర్ లైన్స్ విమానంలో స్ట్రెచర్ పై మెడికల్ ఎవాక్యుయేషన్ చేస్తున్న పెషేంట్ తో అతని భార్య తెనుగు అశ్విని ప్రయాణిస్తున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ కు చేరిన పెషేంట్ ను దక్కన్ హాస్పిటల్ లో చేరుస్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎల్కతుర్తి కి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ లోకిని క్రిష్ణమూర్తి (35) సౌదీలో జూలై 23న అపస్మారక స్థితికి చేరారు. అధిక బీపీ తో, మెదడులోని రక్తనాళాలు చిట్లి కోమాలోకి జారిపోయిన అతనికి, రియాద్





లోని ఎస్ఎంసీ ఆసుపత్రిలో కోమా స్థితిలో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో తెలంగాణ ప్రభుత్వం సౌదీలోని ఇండియన్ ఎంబసీతో సంప్రదించి పెషేంట్ ను వాపస్ తెప్పించడానికి కృషి చేశారు. సౌదీ లోని గ్లోబల్ తెలంగాణ ఫోరం అధ్యక్షులు మహ్మద్ జబ్బార్ సమన్వయం చేశారు. సహాయం కోసం పెషేంట్ తండ్రి సూరయ్య గతనెల 9న 'సీఎం ప్రవాసీ ప్రజావాణి' లో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి మార్గదర్శనం చేశారు.

## నకిలీ మద్యం నిగ్గు తేల్చేందుకు 'సిట్' ప్రకటించిన సీఎం చంద్రబాబు

బృందానికి నేతృత్వం వహిస్తారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈరోజు మీడియా సమావేశంలో నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు రూపొందించిన ఒక ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించిన అనంతరం చంద్రబాబు ఈ కీలక ప్రకటన చేశారు. సిట్ సభ్యులుగా ఐపీఎస్ అధికారులు రాహుల్ దేవ్ శర్మ (ఎక్సైజ్ శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్), కె. చక్రవర్తి (సీఐడీ ఎస్పీ), మల్లికా గార్గ్ (ఆర్టీజీఎస్)లను నియమించినట్టు తెలిపారు. వీరితో పాటు ఎక్సైజ్ శాఖ నుంచి ఈ అంశంపై పూర్తి అవగాహన ఉన్న ఒక నిపుణుడిని కూడా బృందంలో చేర్చుతామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కొన్ని సంచలన వ్యాఖ్యలు చేశారు. నకిలీ మద్యం కేసులో దిగ్భ్రాంతికి గురిచేసే నిజాలు ఉన్నాయని, వాటిని త్వరలోనే బయటపెడతామని అన్నారు. "ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారు ఆఫ్రికాలో నేర్చుకుని ఇక్కడ అమలు చేస్తున్నారు" అని చంద్రబాబు ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న సూత్రధారులను, వారి కార్యకలాపాలను పూర్తిగా వెలికితీసేందుకే సిట్ దర్యాప్తుకు ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా ఆర్‌ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు..

కరీంనగర్లో స్వయంసేవకుల భారీ కవాతు (పథ సంచలన్)...

వందేళ్లుగా సమాజ , మాతృభూమి సేవ కోసం పనిచేస్తున్న ఏకైక స్వచ్ఛంద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ....

ఆర్ఎస్ఎస్ ను అర్థం చేసుకోవాలంటే సంఘంలోకి వచ్చి పని చేయండి...

విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి, ప్రధాన వక్త అయచితుల లక్ష్మణరావు



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 12:**
రాష్ట్రీయ సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాలు కరీంనగర్లో ఘనంగా జరిగాయి. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ వ్యాప్తంగా ఇటీవల విజయదశమి ఉత్సవం పేరిట చేపట్టిన ప్రోగ్రామ్లు, రూట్ మార్చ్ కార్యక్రమాలన్నీ విజయవంతంగా కొనసాగాయి.. సంఘ్ శతాబ్ది సందర్భంగా ఆర్ఎస్ఎస్ సమాజ పరివర్తన ద్వారా దేశ పరమవైభవం సాధ్యమని పంచ పరివర్తన్ కు పిలుపునిచ్చింది. స్వయంసేవకులు కుటుంబ ప్రబోధన్,





స్వదేశీ, సామాజిక పరివర్తన, పర్యావరణం , పౌర విదుల పట్ల ఆలోచించేలా కార్యక్రమాలపై దిశా నిర్దేశనం చేసింది . శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్లో స్వయంసేవకులు ఆదివారం సాయంత్రం భారీ కవాతు ప్రదర్శన చేపట్టారు. శాతవాహన యూనివర్సిటీ రోడ్ లోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నుండి కరీంనగర్ పట్టణంలో పలు ప్రాంతాల మీదుగా రాంనగర్ వరకు రూట్ మార్చ్ ( పథ సంచలన్) కార్యక్రమం కొనసాగింది. తదనంతరం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల మైదానంలో సంచలన్ సమరోప్ (ముగింపు సమావేశం) జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య వక్త గా హాజరైన విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి అయ చితుల లక్ష్మణరావు మాట్లాడుతూ సంఘ్ స్థాపకులు డాక్టర్ కేశవ్ రావు బలి రామ్ పంత్ హెడ్గేవార్ ఆత్మవిశ్వాసంతో, దూర దృష్టితో 1925 సంవత్సరంలో విజయదశమి రోజున ప్రారంభించిన ఆర్ఎస్ఎస్ వందేళ్లుగా సమాజ, మాతృ భూమి సేవ కోసం స్వచ్ఛందంగా పనిచేస్తుందన్నారు. భారతదేశ సమస్యలకు మన సమాజంలో ఉన్న అనైక్యతే ప్రధాన కారణమని డాక్టర్ జి భావించారని, ఆ దిశలోనే జాతిని సంఘటితం చేసే కార్యానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సమాజ , దేశహితం గురించి ఆలోచించే వ్యక్తులు దేశం నలుమూలల నుంచి కావాలనే లక్ష్యంతో ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. సామాజిక స్పృహ, జాతీయ భావన, సంఘటిత దృష్టి, నిస్వార్థం, తోటి వారి పట్ల ప్రేమ కలిగి ఉండడం, ఈర్ష ద్వేషం లేకుండా ఉండే వ్యక్తుల నిర్మాణం కోసమే ఆర్ఎస్ఎస్ నిరంతరం పనిచేస్తుందన్నారు. ఒక గంట శాఖ కార్యక్రమాల ద్వారా సమాజంలోని వ్యక్తుల్లో పరివర్తన తీసుకురావాలనే సంకల్పంతో ఆర్ఎస్ఎస్ ఇన్నేళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.సంఘ్ ప్రారంభం నుండి హిందూ సామాజానికి అవసరమైన ప్రతి విషయంలో పనిచేస్తూ వస్తుందన్నారుహిందూ సమాజంలో మనమందరం ఒకే జాతి వారం అనే భావన నిర్మాణం కావాలన్నారు. హిందుత్వాన్ని మతకోణంలో , రాజకీయ కోణంలో ఆలోచించినంతవరకు ఆర్ఎస్ఎస్ ని అర్థం చేసుకోలేమని, ఆర్ఎస్ఎస్ ను అర్థం చేసుకోవాలంటే ఒక ఆరు నెలలు సంఘంలో వచ్చి పనిచేయాలని పిలుపునిచ్చిన సర్ సంఘ చాలక్ మోహన్ భగవత్ జీ చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్య అతిథి సిద్ధార్థ స్కూల్స్ అధినేత దాసరి శ్రీ పాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. సమాజం కోసం పనిచేస్తున్న స్వయంసేవకులు అభినందనీయులన్నారు. దేశానికి ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థ ఎంతో అవసరమన్నారు.ఇట్టి కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యకారిణి సభ్యులు బూర్ల దక్షిణామూర్తి, నగర సంఘ చాలక్ హనుమండ్ల శ్రీనివాస్ రెడ్డి , కార్యవాహ చామ మహేశ్వర్ స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

రూట్ మార్చ్ లో... స్వయంసేవక్ గా కేంద్రమంత్రి బండి సంజయ్..

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కరీంనగర్లో నిర్వహించిన పథ సంచాలన్ (రూట్ మార్చ్) లో స్వయంసేవక్ గా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు.



వెలుతురు

## పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించిన హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్



**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 12:**



ఆదివారం రోజున జరిగిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని హెల్త్ డైరెక్టర్ శ్రీ రవీంద్ర నాయక్ గారు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బండ్లగూడజాగీర్ రంగారెడ్డి జిల్లాలో, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి ఆధ్వర్యంలో ప్రారంభించారు దేశవ్యాప్తంగా 290 జిల్లాల్లో మరియు మన రాష్ట్రంలో ఐదు జిల్లాల్లో హైదరాబాద్ , రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హనుమకొండ జిల్లాలలో పోలియో నిర్మూలన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు జిల్లాలో 420911 మంది 0 నుండి 5 సంవత్సరాల పిల్లల లక్ష్యంగా సాగిన కార్యక్రమం విజయవంతం అయినది రంగారెడ్డి జిల్లాలో పట్టణ ప్రాంతంలో 422కేంద్రాలు గ్రామీణ ప్రాంతంలో 1129పోలియో చుక్కల కేంద్రంలో ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు, 155మంది రూట్ సూపర్వైజర్లు 6204 మంది బూత్ టీమ్ మెంబర్లను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు స్థానిక సంస్థల అధికారులు పాల్గొన్నారు, అంతేకాకుండా బస్టాండ్లలో మెట్రో స్టేషన్లలో ఎయిర్పోర్టులో అనేక కూడళ్లలో ఈ పోలియో చుక్కల కేంద్రం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు, మొబైల్ టీంలు ఏర్పాటు చేసి భవన నిర్మాణ ప్రాంతంలో మరియు ఇటుక బట్టీల ప్రాంతంలో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు

## హిందూరాజ్య స్థాపనే లక్ష్యంగా పోరాటం భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డి.శివప్రసాద్




**కాచిగూడ వెలుతురు అక్టోబర్ 12:**

రాజకీయాలకతీతంగా హిందూ రాజ్యస్థాపనే లక్ష్యంగా భజరంగ్ సేనదనిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డి.శివప్రసాద్ అన్నారు. ఆదివారం కాచిగూడ, హర్రాజ్పెంటలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోరక్షణ, హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయ పరిరక్షణతో పాటు లవ్ జిహాద్, మతమార్పిడులకు వ్యతిరేకంగా భజరంగ్ సేన రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతుందని తెలిపారు. గోవులను హింసించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టమని, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ సేన నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో గిరిధర్ గోపాల్, రాఘవేంద్ర, డాక్టర్ రాంబాబు, మల్లికార్జున్, నవనీత్ మహేష్, ప్రవీణ్ దేబే తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజారాజ్యం పార్టీలోనికి కూనపనేని హరిప్రసాద్ రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్




**బషీర్బాగ్ వెలుతురు 11అక్టోబర్:ం**

తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ లోనికి గౌరవనీయులు కూనపనేని హరి ప్రసాద్ ఐ ఎ ఎస్ రిటైర్డ్ ఆఫీసర్ చేరారు. భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో ఆఫీసర్ గా సేవలందించి తద్వారా మన తెలంగాణ ప్రాంతంలో కొత్త రాజకీయ నాయకులు రావాలని ఒక నినాదంతో గడిచిన కొంతకాలం నుండి రెండు రాష్ట్రాలకు పరిచయం చేస్తూ అవినీతి రహిత పాలనగా చేయాలని ఉద్దేశంతోనే రాజకీయంలోనికి రావాలని ముందడుగు వేసిన నాయకులు పాత రాజకీయ నాయకులు పోవాలి కొత్త రాజకీయ నాయకులు రావాలని ఆకాంక్షతో ముందుకు వెళుతున్న తరుణంలో తెలంగాణ ప్రాంతంలో పురుడు పోసుకున్న తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ విధి విధానాలు నచ్చి నేడు తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ లోనికి చేరడం జరిగింది తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలకర రవికుమార్ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ దాసరి శ్యామ్ రావు పావిళ్ల సురేష్ ఆధ్వర్యంలో చేరారు ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాన్ని బిజెపికి ఇచ్చారు రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఇచ్చారు మాకు మాత్రం హైదరాబాద్ ఇస్తే పరిపాలన ఏవిధంగా కొనసాగిస్తామని రాష్ట్రానికి చూపించటానికి ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. తద్వారా స్థానిక సంస్థలలో జెడ్పిటిసి ఎంపీటీసీ రానున్న గ్రేటర్ మున్సిపాలిటీ, మేజర్ మున్సిపాలిటీ ఎన్నికలలో మేజర్ తో పాటు డిప్యూటీ మేయర్ కూడా కైవసం చేసుకొని పరిపాలన ఏ విధంగా కొనసాగించాలనేది రాష్ట్రానికి చూపించే అవకాశం తెలంగాణ ప్రజారాజ్యం పార్టీకి ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు దాసరి శ్యామ్ రావు, వావిళ్ళ సురేష్,పాల్గొన్నారు.

## పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో ప్రశాంతం






**బషీర్ బాగ్ వెలుతురు 11 అక్టోబర్:**

అంబర్ పేటలో ఈరోజు పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ వైద్య సిబ్బందితో కలిసి పలువురి చిన్నరులకు పోలియో చుక్కలు వేశారు 5 ఏండ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కల అన్ని అంగన్వాడి కేంద్రాలలో టీచర్స్ వేశారు. మందు వేయిస్తేనే ఆరోగ్యకర భారత్ సాకారం అవుతుంది అని అన్నారు .

# చిన్నారుల బంగారు బంగారు భవిష్యత్తుకై రెండు పోలియో చుక్కలు తప్పక వేయించాలి

- 0-5 పిల్లల తల్లిదండ్రులు పోలియో చుక్కలు తప్పక వేయించాలి.
- జిల్లాలో విస్తృతంగా పల్స్ పోలియో కార్యక్రమం.
- జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి








**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**

చిన్నారుల బంగారు భవిష్యత్తు కై తల్లిదండ్రులు పల్స్ పోలియో చుక్కలు తప్పక వేయించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. తిలక్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 0-5 పిల్లల బంగారు భవిష్యత్ కై పల్స్ పోలియో చుక్కలను తప్పక వేయించాలని అన్నారు. భారతదేశంలో పోలియో రహిత సమాజాన్ని నిర్మానించడానికి 1995లో ప్రారంభించడం జరిగిందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ 2014 లో భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రకటించడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేసారు. అదేవిదంగా పొరుగు దేశాలలో ఇంకా పోలియో కేసులు నమోదు అవుతున్నందున భారతదేశంలో పోలియో కేసులు నమోదు కాకుండా పోలియో కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించుకొని 2586 పల్స్ పోలియో కేంద్రాల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని ఆమె తెలిపారు. జిల్లాలో 0-5 పిల్లలు 5,17,238 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం తేదీ 13 నుండి 15 వరకు కొనసాగుతుందని, 12వ తేదీన పోలియో చుక్కలు వేయించలేనటువంటి పిల్లలకు 11200 మంది వైద్య సిబ్బంది ఇంటింటి కార్యక్రమంలో భాగంగా పోలియో చుక్కలు అందించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలో 9,36,016 ఇండ్లల్లో ఉన్న 0-5 సంవత్సరాల గల పిల్లలకు కవర్ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే 164 హై రిస్క్ ప్రాంతాలలో పోలియో చుక్కల కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 15 వరకు అన్ని రైల్వేస్టేషన్స్, బస్టాండ్లు అలాగే మెట్రో స్టేషన్లలో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతుందని ఆమె తెలిపారు. జిల్లాలోని 2586 కేంద్రాలతో పాటు 91 మొబైల్ టీమ్స్ చిన్నారులకు వలస వాసుల ప్రాంతాలు, తాత్కాలిక నివాసాలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు అలాగే పార్కులలో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అపార్ట్మెంట్లులలో ఉండే 0-5 వయస్సు గల పిల్లలున్న తల్లిదండ్రులు తేదీ 13 నుండి 15 వరకు తమ పిల్లలకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, వాలంటీర్స్, పారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, డి ఎం ఓ రాములు, డిప్యూటీ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రివర్యులు ఆర్. దామోదర్ రెడ్డి గారి దశదిన కర్మలో పాల్గొని నివాళులు అర్పించిన డా. రేఖ బోయలపల్లి గారు

**తుంగతుర్తి వెలుతురు అక్టోబర్ 12:**



తెలంగాణ రాజకీయ చరిత్రలో నిజాయితీ, ధైర్యం, ప్రజాసేవ పట్ల అచంచలమైన నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన మహానుభావులు టైగర్ ఆర్. దామోదర్ రెడ్డి గారి దశదిన కర్మ కార్యక్రమానికి డా. రేఖ బోయలపల్లి గారు హాజరై, ఆయనకు హృదయపూర్వక నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఆర్. దామోదర్ రెడ్డి గారు ప్రజల సమస్యలను తనవిగా భావించి పరిష్కరించడానికి జీవితాంతం కృషి చేసిన నిస్వార్థ నాయకుడు. ఆయన చూపిన మార్గం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు స్ఫూర్తి. ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత తెలంగాణ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎమ్మెల్యేలు పలువురు కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తుంగతుర్తిలో జరిగిన ఈ సంస్మరణ సభలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు పాల్గొని, శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ స్టేజ్-2 (SRSP Stage-2) కు దివంగత నేత పేరు మీదుగా లి"రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఎస్సారెస్పీ-2"లిగా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల డా. రేఖ బోయలపల్లి గారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దామోదర్ రెడ్డి గారు మన మధ్య భౌతికంగా లేకున్నా ఆ నాయకుడి సేవలను గుర్తించి, ఆయన పేరును ప్రాజెక్టుకు ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి గారు ఆయనకు ఇచ్చిన గౌరవం తెలంగాణ కాంగ్రెస్ ఆత్మస్ఫూర్తికి ప్రతీక. ప్రజా సేవను గౌరవించే ఈ నిర్ణయం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త హృదయాన్ని తాకింది. దీనికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని తెలిపారు.

## కొమ్మాయిగూడెం లో యువత అవగాహనా కార్యక్రమం లో పాల్గొన్న యువకులు.



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 12**

కొమ్మాయిగూడెం గ్రామంలో వీరమళ్ళ సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన యువత అవగాహనా కార్యక్రమం లో గ్రామ యూత్ ఎజెండా గా గ్రామ సమస్యలు ,యువతలో చైతన్యం, డ్రగ్స్ నిర్మూలన, అవినీతి రహిత రాజకీయం, గ్రామ అభివృద్ధి కోసం కొన్ని ప్రత్యేక అంశాలు పై చర్చించడం జరిగింది. ఇట్టి అంశాలపై యువత అందరు కట్టుబడి ఉంటాం అని వాగ్దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో అంబాలా అశోక్, కల్లూరి శివకుమార్, వీరమళ్ళ ప్రకాష్, బాలగోని శివ, బోయపల్లి శంకర్,బుర్ర శ్రీశైలం అంతటి ఆదిత్య, తండ కిరణ్, గోపగోని వెంకటేష్, ఆకిటి శేఖర్, కొండగడప విజయ్, దావునూరి ఉపేందర్, , రవి, వీరమళ్ళ వెంకటేష్, బోయపల్లి భరత్, విష్ణు, కల్లూరి మహేష్, ఆకిటి శివ, గణేష్, మచ్చగిరి, వెంకటేష్, కొమ్మాయిగూడెం గ్రామ యువత పాల్గొనడం జరిగింది.

# విదేశాల్లో స్వామివారి కల్యాణోత్సవ వివరాలు వెల్లడించాలి

## బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ డిమాండ్

**యాదగిరిగుట్ట అక్టోబర్ 12 ( వెలుతురు)**




ఇటీవల విదేశాల్లో వరుసగా నిర్వహిస్తున్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణోత్సవ కార్యక్రమాల ఆదాయ వ్యయాల వివరాలను, వీటికి సంబంధించిన ఇతర సమాచారాన్ని భక్తులకు తెలియజేయాలని బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణ బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న అనేక అంశాలను బిజెపి ఆధ్వర్యంలో వెలుగులోకి తెచ్చే ప్రయత్నంలో తాము ఉన్నామని అన్నారు . విదేశాల్లో స్వామివారి కల్యాణోత్సవం వివరాలు తెలియజేయాలని తాము డిమాండ్ చేస్తే , దేవస్థానం అధికారులు తాము ప్రస్తావించిన అంశాలను ఖండించడం సరి అయింది కాదని అన్నారు . వారు తక్షణమే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా స్వామివారి ప్రచారానికి, హిందు ధర్మ పరిరక్షణ కోసం తాము పాటుపడుతున్నామని అధికారులు కారణాలు చెప్పి తప్పించుకోవడం సరి అయింది కాదని అన్నారు. స్వామి వారి మహత్యం, చరిత్రను ప్రచారం చేయాలని ఉంటే మన దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో స్వామివారి కళ్యాణము జరిపి, హిందూ ధర్మ ప్రచారం చేయాలని అన్నారు. కొంతమంది అధికారులు అనేకసార్లు విదేశాల పర్యటనలు చేస్తూ, నాలుగు రోజుల కళ్యాణం కోసం అనేక రోజులపాటు విదేశాల్లో ఉండటం వెనుక ఆంతర్యం ఏమిటని, దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కొంతమంది అధికారుల మీద ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయని, వారిపై తక్షణమే విచారణ చేయాలని అన్నారు. కొంతమంది అధికారులు వారు ఉద్యోగంలో చేరినప్పుడు వారి ఆస్తుల వివరాలు, ప్రస్తుతం వారి ఆస్తుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. మన భారత దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో ఎన్నిసార్లు స్వామి వారి కళ్యాణం చేసారని మేము ప్రశ్నిస్తున్నాం..? అని అన్నారు. ఇతర రాష్ట్రాలలో ఎన్నిసార్లు కళ్యాణ మహోత్సవాలు జరిపారో ...ఆలయ అధికారులు తెలపాలని డిమాండ్ చేస్తున్నాం..? అన్నారు. వేరే ప్రైవేట్ వ్యక్తులు కూడా ఖర్చులు మేమే భరిస్తాం.. మా దగ్గరికి దేవుడి ఉత్సవ విగ్రహాలతో వచ్చి కళ్యాణం చేయండి అంటారు... అప్పుడు మీరు వెళ్తారా %"%? అని ప్రశ్నించారు. యాదగిరిగుట్ట దేవస్థానం నుండి విదేశాలలో స్వామివారి కల్యాణోత్సవాల పేరిట విదేశాలకు వెళ్తున్న అధికారులు, అర్చకుల వ్యవహారంపై పూర్తి వివరాలు భక్తులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేవస్థానం అధికారులు పూర్తి వివరాలు వెల్లడించే వరకు తాము బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని, వాస్తవాలు బయటపడే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జిల్లా భానుచందర్ ,కార్యదర్శి పలుగుల సురేష్ ,ఆవుల సత్యనారాయణ ,సీనియర్ నాయకులు బెలిదే అశోక్ ,బందరపు మల్లేష్ గౌడ్ ,సుడుగు రాజిరెడ్డి, దొమ్మాట నరేష్ ,బోడ బుచ్చిబాబు ,కర్రె లక్ష్మయ్య ,శివరాత్రి శ్రీశైలం ,రాపోలు నవీన్ ,భోగ అజయ్ ,కాలూరి విజయ్ ,శివరాత్రి వంశీ ,వంగ శ్రీకాంత్ ,సంద ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓసీలకు రిజర్వేషన్ ప్రకటించాలి

## ఓసీ హక్కుల పరిరక్షణ సంఘం నేత కౌకుంట్ల బాల్ రెడ్డి , సీనియర్ నాయకులు నువ్వుల రమేష్

**యాదగిరిగుట్ట, అక్టోబర్ 12 ( వెలుతురు )**



ఓసి సామాజిక వర్గాలకు కూడా రిజర్వేషన్ ప్రకటించాలని ఓసి హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు కౌకుంట్ల బాల్ రెడ్డి, నువ్వుల రమేష్ లు కోరారు. స్థానిక ఎన్నికలతో పాటు, అన్ని ఎన్నికల్లో ఓసి జనాభా ప్రాతిపదికన కొన్ని స్థానాల్లో కేవలం ఓసీలు మాత్రమే పోటీ చేసేలా చట్టం చేయాలని అన్నారు. జనరల్ స్థానాల్లో ఓసి లతోపాటు ఇతర సామాజిక వర్గాలు కూడా పోటీ పడుతుండడంతో ఓసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు . జనరల్ స్థానాల్లో కేవలం ఓసీలు మాత్రమే పోటీ చేసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకొని చట్టం రూపొందించాలని అన్నారు. రిజర్వేషన్ స్థానాల్లో రిజర్వేషన్ ఉన్న సామాజిక వర్గాలు పోటీ చేయడంతో పాటు, జనరల్ స్థానాల్లో కూడా ఓసి లకు పోటీగా ఇతర సామాజిక వర్గాలు పోటీకి దిగుతుండడంతో ఓసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. జనరల్ స్థానాల్లో కేవలం ఓసి సామాజిక వర్గాలే పోటీ చేసేలా చట్టం తీసుకు వస్తే తమకు కూడా న్యాయం జరుగుతుందని అన్నారు. ఓసీల్లో కూడా ఆర్థికంగా పేద, మధ్యతరగతి వాళ్ళు ఉన్నారని అన్నారు. ఓసీలు అంటే కేవలం ఆర్థికంగా బలంగా ఉన్నవారని అర్థం కాదని అన్నారు. తమ ఓసీ సామాజిక వర్గంలో కూడా పేదలు నిరుపేదలు కూడా ఉన్నారని అన్నారు. వారికి కూడా ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనరల్ స్థానాలను కేవలం ఓసీలకే కేటాయించాలని అన్నారు . దీంతోపాటు ఓసీలకు విద్యా , ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తగిన అవకాశాలు కల్పించాలని అన్నారు . ఓసీల జనాభాను బట్టి వారికి స్థానిక , అసెంబ్లీ , పార్లమెంటు ఎన్నికల్లో తగినన్ని సీట్లను కేటాయించాలని, ఆ సీట్లలో కేవలం ఓసీలే పోటీ చేసేలా చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. తమ విజ్ఞప్తిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకొని తగిన విధంగా చట్టం రూపొందించి ఓసీలకు న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు.

# రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు భారీ విరాళాలు

**-విరాళాలు అందజేసిన వారికి దేవాలయ కమిటీ సభ్యులు ఘన సత్కారం...**



**వెలుతురు, చారకొండ అక్టోబర్ 12 :**

జేపల్లి గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ అభివృద్ధికి జేపల్లి గ్రామంలో ఆదివారం పలువురు నుంచి భారీ విరాళాలు అందజేశారు. దోస్తీ పౌండేషన్ ఛైర్మెన్ వంకేశ్వరం రమేష్ రూ. 50,116, కిరాణం షాపు వంకేశ్వరం వెంకటయ్య రూ. 10,116 విరాళం అందజేశారు. విరాళాలు అంద జేసిన వారికి దేవాలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఆదివారం రోజున నారాయణపురం మండలం మల్లారెడ్డి గూడెం గ్రామం చెందిన వీరమల్ల సత్తయ్య భార్య పుష్పలత కి ఆరోగ్య నిమిత్తం హాస్పిటల్ ఖర్చులకు చలమల్ల కృష్ణా రెడ్డి 10,000 మరియు అన్నం మల్లేశ్ 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగినది

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు అక్టోబర్ 12:**

# పోలియో చుక్కలతో సేవా ముద్ర వేసిన శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థినులు

**- పర్యవేక్షించిన జహీరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల, రాజేంద్రనగర్ విద్యార్థినులు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థినులు తమ మూడు నెలల గ్రామీణ ఉద్యాన వృత్తి అనుభవ కార్యక్రమంలో భాగంగా రంజోల్, బాబా నగర్, మహేంద్ర కాలనీ, చిన్న హైదరాబాద్ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఐదు సంవత్సరాల లోపు బాలబాలికలకు పోలియో చుక్కల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులకు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. పోలియో చుక్కలు వేయడం, ఎనేబుల్ ఇంక్ మార్క్ చేయడం వంటి కార్యకలాపాలలో విద్యార్థులు పాల్గొన్నారు. జహీరాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఈ సేవా కార్యక్రమంలో విద్యార్థినులు భార్గవి, లయ, మధులత, నవ్య, చైత్ర, నిశిత, జ్ఞాని తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు విద్యార్థుల సేవను మెచ్చుకున్నారు.

# రోజుకో గంట ధర్మం కోసం పనిచేయాలి

**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 12 :**





ప్రతిరోజు గంటసేపు ధర్మం కోసం పనిచేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా విభాగ సహసంపర్క్ అవడం అంబరీష్ అన్నారు.రాష్ట్రీయ స్వయం సేవిక్ సంఘ్ ఉత్సవాలలో భాగంగా ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలో స్వయం సేవకులు పదసంచాలను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రామ్ మందిర్ నుంచి స్వయంసేవకులు ఘోష్ తో పూర్తిస్థాయి గన్వేష ధరించి మంగళపేట దుర్గామాత ఆలయం వరకు కొనసాగారు.దుర్గామాత ఆలయ సమీపంలోని మా ఫంక్షన్ హాల్ ఆవరణలో సంపద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ భారతదేశ పరాక్రమాన్ని ఎవరు తగ్గించలేరని, ప్రతి ఒక్క భారతీయుడు భారత దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు ఎల్లవేళలా కృషి చేయాలన్నారు.

# అంగవికల్యానికి రక్ష...రెండు పోలియో చుక్కలు సురక్ష

**ఏఐబీఎస్సెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్....**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**



పోలియో చుకులతో పిల్లల శరీర వికాసానికి తోడ్పాటు ఉంటుందని, పోలియో రహిత రాష్ట్రం నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పుట్టిన నాటి నుంచి 5 ఐదేళ్లు పూర్తయ్యే చిన్నపిల్లలకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని చేపట్టిందని అల్ ఇండియా బంజారా సేవ సంఘ్ అధ్యక్షుడు, యువజన కాంగ్రెస్ నాయకులు పవార్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఆదివారం నాడు పట్టణంలోని చిన్న హైదరాబాద్ వార్డులో జరిగిన పోలియో చుక్కల కార్యక్రమనికి శ్రీనివాస్ నాయక్ హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పుట్టిన చిన్న పిల్లల నుంచి ఐదేళ్లు పూర్తయ్యే వారికి వీర్యాలని, గతంలో పోలియో ఇంజెక్షన్, చుక్కలు వెయ్యకపోవడం వల్ల శారీరకంగా బలహీనులు అయ్యేవరని, 2004 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలియోను దేశవ్యాప్తం చేసి ఇంటింటికి తిరిగి ప్రజలకు పోలియో కార్యక్రమన్ని ప్రారంభించి అమలు చేశారని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్వయంసేవకులు ప్రముఖులు పాల్గొన్నారు.

# వేగంగా స్పందిస్తూ... విమర్శలు గుప్పిస్తూ....

**వివాదాస్పద నాయకుడిగా మారుతున్న బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్**

**తరచుగా అధికార పార్టీని... ఇతరులను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్న యువ నాయకుడు**

**అంశం ఏదైనా... సమస్య ఎక్కడున్నా ..వాడి వేడిగా ఆరోపణలు, విమర్శనాస్త్రాలు ఎక్కు పెడుతున్న బిజెపి పట్టణ అధ్యక్షుడు..!?**

**ప్రజా సమస్యలపై వేగంగా స్పందించే చురుకైన యువ నాయకుడిగా పేరున్న ప్రవీణ్...**
**తరచుగా వివాదాల తేనె తుట్టెను కదుపుతారని ప్రత్యర్థుల విమర్శలు**

**కర్రె ప్రవీణ్ కు బాగా పేరు వస్తోందంటూ... సొంత పార్టీలోనూ గుర్రుగా ఉన్న కొందరు నేతలు ??**

**( పుట్ట హనుమంత్)**

**యాదగిరిగుట్ట, అక్టోబర్ 12 ( వెలుతురు )**



బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కర్రే ప్రవీణ్ రోజురోజుకు వివాదాస్పద నాయకుడిగా మారుతున్నారు . ఇప్పుడు ఇతర పార్టీల నాయకులకు, వివిధ వర్గాల వారికి కర్రె ప్రవీణ్ టార్గెట్ గా మారారని రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ నడుస్తోంది. కర్రె ప్రవీణ్ తరచుగా అధికార పార్టీపై విమర్శనాస్త్రాలు ఎక్కు పెడతారు . కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై, స్థానిక ఎమ్మెల్యే కార్యక్రమాలపై తరచుగా స్పందిస్తూ విమర్శలు, ఆరోపణలు చేస్తుంటారు. దీంతో ఆ పార్టీ నాయకులు కూడా ఆయనపై ఘాటుగానే స్పందిస్తూ ఆయన విమర్శలను తిప్పి కొడుతున్నారు. కర్రె ప్రవీణ్ కు చురుకైన యువ నాయకుడిగా, ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటున్న నాయకుడిగా పేరు ఉన్నప్పటికీ, ఇటీవల కాలంలో జరుగుతున్న అనూహ్య పరిణామాల నేపథ్యంలో వివాదాస్పద నాయకుడిగా ఆయనకు ముద్ర పడుతోంది. బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కర్రే ప్రవీణ్ కాంగ్రెస్ తో పాటు ఇతర పార్టీల నాయకుల పై తరచుగా విమర్శలు గుప్పిస్తున్నారు. సమస్య ఎక్కడున్నా అంశం ఏదైనా వేగంగా స్పందిస్తూ ఆయా అంశాల పై , పలు సమస్యల పై తరచుగా స్పందిస్తూ వాటితో సంబంధం ఉన్న వారిపై నేరుగా పెద్ద ఎత్తున ఆరోపణలు, విమర్శలు చేస్తుంటారు. దీంతో రోజు రోజుకు కర్రె ప్రవీణ్ వివాదాస్పద నాయకుడిగా మారుతున్నారు . ఇప్పుడు అందరికీ ఆయన టార్గెట్ గా మారుతుండడంతో ప్రస్తుతం ఎక్కడ రాజకీయాల గురించి విన్నా ... రాజకీయ వర్గాల్లో ఎక్కడ చర్చ వచ్చినా.... టార్గెట్..కర్రే ప్రవీణ్ ....అనే టాక్ వినబడుతోంది...మరో విశేషం ఏంటంటే ఆయన సొంత పార్టీ అయిన బిజెపిలోనే కొందరు నాయకులు ఆయనకు వస్తున్న పేరును చూసి జీర్ణించుకోలేక లోలోపల ప్రవీణ్ ను టార్గెట్ చేస్తున్నట్లు సమాచారం . ఎలాగైనా కర్రె ప్రవీణ్ ను కట్టడి చేయాలని, లేకపోతే తమను మించి పోతాడని కొందరు నాయకులు గుసగుసలాడుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. దీంతో కర్రె ప్రవీణ్ ప్రెస్ మీట్ లకు , ఆయన కార్యక్రమాలకు ఆ నాయకులు అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. బిజెపిలో ప్రవీణ్ కి వ్యతిరేకంగా మరో వర్గాన్ని తయారు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

గతంలో పెద్ద కందుకూరు ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో, మోటకొండూర్ మండలం కాటేపల్లి ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలలో ప్రమాదాలు జరిగినప్పుడు ఆ కంపెనీ యజమాన్యాల తీరుపై, ఇటు స్థానిక ఎమ్మెల్యే పై కర్రె ప్రవీణ్ పెద్ద ఎత్తున ఆరోపణలు విమర్శలు చేశారు. అదేవిధంగా తరచుగా ఆయన యాదగిరిగుట్ట దేవస్థానంలో జరిగే పలు అంశాలపై స్పందిస్తూ, ఘాటైన ఆరోపణలు , విమర్శలు చేస్తుంటారు. గతంలో చింతపండు దొంగతనం జరిగినప్పుడు ఆ అంశంలో ప్రవీణ్ అనేక ఆరోపణలు విమర్శలు చేశారు. ఏకంగా ఓ అధికారిని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో కొందరు అధికారులు ఏళ్ల తరబడి ఇక్కడే ఉద్యోగం చేస్తూ పాతుకుపోయారంటూ ఘాటుగా విమర్శించారు. దేవస్థానం అధికారులు వారు ఉద్యోగంలో చేరినప్పుడు వారి ఆస్తుల విలువ ఎంత? ప్రస్తుతం వారి ఆస్తుల విలువ ఎంత? అని ప్రశ్నించి ప్రవీణ్ వివాదాల తేనె తుట్టెను కదిపారు. అయితే కర్రె ప్రవీణ్ తండ్రి కూడా గతంలో దేవస్థానం ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయన తండ్రి కూడా అనేక అవకతవకలకు పాల్పడ్డారంటూ, దీనిపై కర్రె ప్రవీణ్ సమాధానం చెప్పాలంటూ ఆయన వ్యతిరేక వర్గీయులు , ఇతర పార్టీల నాయకులు ప్రవీణ్ కు సవాల్ విసిరారు . అయితే తన తండ్రి దేవస్థానం ఉద్యోగిగా ఉన్న సమయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని, ఇందుకోసం తాను ఎలాంటి చర్చకైనా సిద్ధమని ప్రవీణ్ కూడా ప్రతి సవాల్ విసిరారు. తరచుగా దేవస్థానంలోని వివిధ శాఖల్లో జరుగుతున్న పలు అంశాలపై అనేక సమస్యలపై కర్రె ప్రవీణ్ ఘాటుగా స్పందిస్తూ విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతుండడం వివాదాస్పదంగా మారుతుంది. ఇటీవల దేవస్థానం లో పదవీ విరమణ పొందిన ప్రధాన అర్చకులు నల్లంతీగల్ లక్ష్మీనరసింహాచార్యులు కుమారుడు నల్లంతీగల్ ధర్మ ప్రనిత్ పై కర్రె ప్రవీణ్ చేసిన విమర్శలు యాదగిరిగుట్టలో తీవ్ర చర్చకు దారి తీశాయి . ధర్మ ప్రణీత్ నిబంధనలకు విరుద్ధంగా ఆయన యాడ్స్ కంపెనీకి సంబంధించిన బోర్డులను పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా నుండి వైకుంఠ ద్వారం వరకు పెట్టారంటూ కర్రె ప్రవీణ్ దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేశారు. వాటిని తొలగించే వరకు పట్టుబట్టి ఆందోళనలు నిర్వహించారు. దీంతో కొన్ని రోజులపాటు ధర్మ ప్రణీత్ కు కర్రే ప్రవీణ్ కు మధ్య వాడి వేడిగా చర్చలు వాదోపవాదాలు జరిగాయి. కర్రె ప్రవీణ్ తనను డబ్బులు డిమాండ్ చేశారంటూ ధర్మ ప్రనిత్ ఆరోపణ చేయగా, తాను డబ్బులు డిమాండ్ చేసినట్టు ధర్మ ప్రనిత్ నిరూపించాలని లేకపోతే దేనికైనా సిద్ధమేనా? అంటూ కర్రె ప్రవీణ్ సవాలు విసరడంతో వివాదం పెద్దదిగా మారింది. వీరిద్దరి మధ్య వివాదం యాదగిరిగుట్టలో పెద్ద దుమారం చెలరేగేలా చేసింది. ఇక ప్రస్తుతం బిజెపి పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ విదేశాల్లో జరుగుతున్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవ కార్యక్రమాలపై స్పందించారు. ఈ కళ్యాణోత్సవ కార్యక్రమాల నిమిత్తం విదేశాలకు వెళ్తున్న అధికారులు అర్చకులు ఏం చేస్తున్నారు ? తెలియజేయాలంటూ ఆయన దేవస్థానం ఉన్నతాధికారులను ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై కర్రే ప్రవీణ్ పలు విమర్శలు చేయగా , దీనికి స్పందించిన దేవస్థానం అధికారులు కర్రె ప్రవీణ్ విమర్శలు ఆరోపణలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. స్వామి వారి చరిత్రను మహత్యాన్ని విదేశాల్లో తెలియజేసేలా, ఖండాంతరాల్లో యాదగిరిగుట్ట వైభవాన్ని మారుమోగేలా చేస్తున్నామని దీనిపై లేనిపోని విమర్శలు చేయడం తగదు అంటూ దేవస్థానం అధికారులు ప్రకటించారు. కాగా బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ మాత్రం స్వామివారి కల్యాణోత్సవం పేరిట దేవస్థానానికి చెందిన అధికారులు అర్చకులు విదేశాల్లో తిరుగుతూ ఎంజాయ్ చేస్తున్నారంటూ ఆరోపణలు విమర్శలు గుప్పించడంతో స్థానికంగా దుమారం చెలరేగుతోంది. విదేశాల్లో స్వామివారి కళ్యాణం నిర్వహించగా జరిగిన వ్యయం , వచ్చిన ఆదాయం వివరాలు ప్రకటించాలంటూ కర్రె ప్రవీణ్ డిమాండ్ చేస్తున్నారు. ఇలా అనేక అంశాలపై కర్రె ప్రవీణ్ ఘాటుగా స్పందిస్తూ పలువురిని టార్గెట్ చేస్తూ విమర్శలు ఆరోపణలు గుప్పిస్తుండడంతో తరచుగా వివాదాలు చెలరేగుతున్నాయి. దీంతో ప్రస్తుతం యాదగిరిగుట్ట బిజెపి పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ వివాదాస్పద నాయకుడిగా మారుతున్నారంటూ రాజకీయ వర్గాల్లో వాడి వేడిగా చర్చలు జరుగుతున్నాయి. అసలు కర్రె ప్రవీణ్ టార్గెట్ ఏంటి? ఆయన రాజకీయ లక్ష్యం ఏమిటి ? అనే అంశాలపై జోరుగా చర్చలు సాగుతున్నాయి. మరోవైపున ఆయన వ్యవహార శైలి సొంత పార్టీలోనూ, బయట చర్చనీయాంశంగా మారింది.

# కల్లుగీత కార్మికులకు ఎక్స్గ్రేషియా వెంటనే ఇవ్వాలి
# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

**కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని, జిల్లా అధ్యక్షులు యమగాని**

**కేజీకేఎస్ 5వ మండల మహాసభకు ముఖ్యఅతిథిగా చిలువేరు సమ్మయ్య గౌడ్**

**గీత కార్మికులకు మోటార్ సైకిల్, సేఫ్టీ మోకులను వెంటనే అందజేయాలి సమ్మయ్య గౌడ్ చిలువేరు**

**కేసముద్రం వెలుతురు అక్టోబర్ 12:**





ప్రభుత్వం కల్లుగీత కార్మికులకుఇచ్చిన మాటను నిల బెట్టుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం మానుకోట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యమగాని వెంకన్న గౌని వెంకన్న,సమ్మయ్య గౌడ్ లు అన్నారు. మండల కేంద్రంలోని హరిహర గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన కేజీకేఎస్ 5వ,మండల మహాసభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన మాటను నిల బెట్టుకోవాలని, గీత కార్మికులకు రావలసిన ఎక్స్ గ్రేషియా 20 లక్షలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న ఎక్స్గ్రేషియా నిధులను వెంటనే అందేలా చూడాలని,గీత కార్మికులకు మోటార్ సైకిల్ లను, సేఫ్టీ మోకులను వెంటనే అందజేయాలని అన్నారు.కల్లుగీత కార్మిక సంఘం మొదటి నుండి కార్మిక సంఘం చేసిన పోరాటాలను ప్రతి ఒక్క గౌడ బిడ్డ గుర్తుపెట్టుకుని ఏమాత్రం తగ్గకుండా అదే స్ఫూర్తిని తర్వాత తరానికి అందించాలని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలలో ఉన్న గౌడ బిడ్డలు వారి యొక్క సత్తా చాటుకునే రోజులు వచ్చాయని ప్రతి ఒక బిడ్డ కలిసికట్టుగా కల్లుగీత కార్మిక సంఘం ఐక్యతను ప్రభుత్వానికి చాటి చెప్పేలా చూడాలని ఉన్నారు. కేజీకేఎస్ కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్నప్పటికీ దానిని బలోపేతం చేయడానికి నా యొక్క సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని, అదేవిధంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేలా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ముందుంటానని, ప్రతి గౌడ కుటుంబానికి ఒక కొడుకులా ముందుండిఅన్ని విధాలుగా అండగా నిలబడి కాపాడుకుంటానని అన్నారు.సమావేశం అనంతరం కేసముద్రం మండల కేజీ కేఎస్ నూతన కమిటీని ప్రకటించారు.. అధ్యక్షులు గా బబ్బురి ఉప్పలయ్య,ఉపాధ్యక్షులు మేడి వెంకటేశ్వర్లు, వంగ సంపత్,కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు,సహాయ కార్యదర్శి జోగు రవీందర్, సభ్యులుగా కదిర సోమయ్య,బుర్ర వెంకన్న,రాంపల్లి వెంకన్న,చిర్లగోని సాయిలు,గడ్డం ప్రభాకర్,గోపగాని వీరన్న,బొమ్మగాని ఎల్లయ్య,సోషల్ మీడియా కన్వీనర్ ముంజాల కుమారస్వామి,కోకన్వీనర్ మేంచు వంశీ లను ప్రకటించారు..

# జహీరాబాద్‌లో అట్టహాసంగా ముగిసిన మెతడిస్ట్ లాంగ్ బౌండరీ క్రికెట్ టోర్నమెంట్

**- టోర్నమెంట్ లో పాల్గొన్న మొత్తం 42 జట్లు...**

**- విజేతగా నిలిచి కప్ తో పాటు రూ. 20,999 నగదును**

**సాధించిన స్థానిక క్రిస్టియన్ కాలనీ క్రికెట్ జట్టు...**

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మెతడిస్ట్ ఫెల్లోషిప్ వారి ఆధ్వర్యంలో 10రోజులుగా నిర్వహించిన మెతడిస్ట్ లాంగ్ బౌండరీ క్రికెట్ టోర్నమెంట్ లో స్థానిక క్రిస్టియన్ కాలనీ క్రికెట్ జట్టు టోర్నీ విజేత గా నిలిచింది. ఈ టోర్నమెంట్ లో మొత్తం 42క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఆదివారం నాడు స్థానిక ఎం ఆర్ హెచ్ ఎస్ గ్రౌండ్స్ లో అల్లీపూర్, క్రిస్టియన్ కాలనీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో క్రిస్టియన్ కాలనీ జట్టు గెలిచి, టోర్నమెంట్ లో విజేత గా నిలిచింది. గెలుపొందిన విన్నర్ జట్టుకు కప్ తో పాటు 20,999 రూపాయలు నగదు బహుమతిని, రన్నర్ జట్టు కు కప్ తో పాటు 14,999 రూపాయలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమం లో మెత్తడిస్ట్ జిల్లా సూపరింటెండెంట్ రెవరెండ్ ఎం సుకుమార్ తో పాటు జిల్లా లే లీడర్ సరిన్ జాన్, జిల్లా కార్యదర్శి వై రవి కుమార్, ఎం ఆర్ హెచ్ ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ సబితా స్వరాజ్, హాస్టల్ సూపరింటెండెంట్ సంతోషమ్మ, ఎం వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి స్నేహిత్ షీల్, జిల్లా ఎం వై ఎఫ్ అడ్వైజర్ పి స్వణీత్ షీల్, ఇజ్రాయెల్ బాబీ తదితరులు పాల్గొన్నారు.

# పోలియో దినం సందర్భంగా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో చుక్కల కార్యక్రమం

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 12:**



పోలియో నివారణ దినాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శుభారంభం జరిగింది. పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవకృష్ణ మాట్లాడుతూ జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక పోలియో స్టాండ్ ఏర్పాటు చేయబడింది. ఇది సాయంత్రం 4:30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.భారతదేశం ఇప్పటికే పోలియోరహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, కొన్ని దేశాల్లో ఇంకా ఈ వ్యాధి కొనసాగుతుండటంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ప్రతి చుక్క పసికందు జీవితాన్ని కాపాడుతుంది. ప్రతి తల్లి తండ్రి తన బిడ్డకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడంలో భాగస్వాములవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ కవాతులో బండి సంజయ్





కరీంనగర్ లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ప్రారంభమైన బండి సంజయ్ జీవితం

చదువుకునే సమయంలో కరీంనగర్ రాంనగర్ బస్తీలో ముఖ్య శిక్షక్ గా కొనసాగిన బండి సంజయ్

కరీంనగర్ రాంనగర్ సత్యనారాయణ స్వామి టెంపుల్ నుండి ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్ లో పాల్గొన్న బండి సంజయ్

ఆర్ఎస్ఎస్ వస్త్రధారణతో ఆకట్టుకున్న కేంద్ర మంత్రి

బండి సంజయ్ తోపాటు రాష్ట్రీయ స్వయం సేవక్ రూట్ మార్చ్ లో పాల్గొన్న ఆయన కుమారుడు బండి సాయి సుముఖ్

ఆర్ఎస్ఎస్ పథ సంచలన్ సమారోప్ కార్యక్రమంలో పాల్గొననున్న కేంద్ర మంత్రి











కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 12:
కరీంనగర్ లో రాష్ట్రీయ సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ స్వయం సేవకులు ఆదివారం రోజున భారీ కవాతు ప్రదర్శన చేపట్టారు. శాతవాహన యూనివర్సిటీ రోడ్ లోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నుండి కరీంనగర్ పట్టణంలో పలు ప్రాంతాల మీదుగా రాంనగర్ వరకు రూట్ మార్చ్ ( పథ సంచలన్) కార్యక్రమం కొనసాగింది. అనంతరం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల మైదానంలో సంచలన్ సమరోప్ (ముగింపు సమావేశం) జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య వక్త గా విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి అయ చితుల లక్ష్మణరావు హాజరయ్యారు. ఈ కవాతు సందర్భంగా అందరి దృష్టి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పైనే పడింది. రాష్ట్రీయ స్వయం సేవక్ డ్రెస్ ధరించి ఈ కవాతులో పాల్గొన్నారు. స్వయం సేవకులతో కలిసి చైతన్య కాలేజీ వరకు కవాతు చేశారు. బండి సంజయ్ చిన్నప్పుడు కరీంనగర్ లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగానే జీవితాన్ని ప్రారంభించారు. చదువుకునే సమయంలో కరీంనగర్ రాంనగర్ బస్తీలో ముఖ్య శిక్షక్ గా కొనసాగారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల కవాతు సందర్భంగా కరీంనగర్ రాంనగర్ సత్యనారాయణ స్వామి టెంపుల్ వద్దకు వచ్చిన కేంద్ర మంత్రి ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్ లో పాల్గొన్నారు. మరోవైపు పెద్ద ఎత్తున తరలివచ్చిన విద్యార్థులు, స్థానిక ప్రజలు సైతం ఆర్ఎస్ఎస్ కవాతును ఆసక్తిగా తిలకించడంతోపాటు కవాతుపై పూల వర్షం కురిపిస్తూ తమ మద్దతును తెలియజేశారు. మరోవైపు బండి సంజయ్ తోపాటు ఆయన కుమారుడు బండి సాయి సుముఖ్ సైతం ఆర్ఎస్ఎస్ కవాతులో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించారు. ఆర్ఎస్ఎస్ కవాతు ముగిసిన అనంతరం నిర్వహించిన సమారోప్ కార్యక్రమంలోనూ బండి సంజయ్ పాల్గొన్నారు.

# మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులకు మొక్కులు చెల్లించుకున్న మంత్రి సీతక్క



**మేడారం వెలుతురు అక్టోబర్ 12:**
మంత్రి సీతక్క మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు గద్దెల ప్రాంగణాన్ని విస్తరించింది, అద్భుతంగా గుడినీ అభివృద్ధి చేసి భక్తులకు ఎంత మెరుగైన దర్శనాన్ని, సదుపాయాలను కల్పించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి గారు పనిచేస్తున్నారు సీఎం ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి వారం క్రితమే మేడారం అభివృద్ధి పనులు మొదలయ్యాయి జాతర రాకముందే పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుంటున్నారు తల్లుల మీద మీద రోజు రోజుకి భక్తుల విశ్వాసం పెరుగుతోంది దీంతో భక్తులు పెద్ద ఎత్తున వస్తున్నారు మేడారం మహా జాతర ఏర్పాట్లు ఇప్పటికీ మొదలయ్యాయి మేడారం పనులు శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు సాగుతున్నాయి భక్తులకు ఎక్కడ అసౌకర్యం కలగకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నాం గుడి అభివృద్ధిలో నాకు భాగస్వామ్యం దక్కడం నా అదృష్టం సీఎం గారికి, జిల్లా ఇంచార్జ్ ఇన్చార్జ్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి ఎండోమెంట్ మినిస్టర్ సురేఖ గారికి, ట్రైబల్ మినిస్టర్ అడ్లూరి లక్ష్మన్ గారికి ధన్యవాదాలు ప్రతి దశలో పూజారులను సంప్రదిస్తూ పనులు కొనసాగిస్తున్నాము గుడి నిర్మాణంలో ఆదివాసుల చరిత్ర, సమ్మక్క సారలమ్మ గోవిందరాజు పగిడిద్దరాజుల కుటుంబాల చరిత్ర, వారి త్యాగాలు, పూజారుల వంశ చరిత్ర ను భవిష్యత్తు తరాలకు అందించేలా అభివృద్ధి పనులు చేస్తున్నాము ఈ జన్మకు ఇదో గొప్ప అవకాశం గా భావిస్తున్నాం ఎవరెన్ని







విమర్శలు చేసినా వెయ్యేండ్లు నిలిచేలా మేడారాన్ని అభివృద్ధి చేస్తాం నాకు జన్మనిచ్చింది సమ్మక్క సమ్మయ్య కానీ నాకు పునర్జన్మ ఇచ్చింది సమ్మక, సారలమ్మ, పగిడిద్ద గోవిందరాజులు. సారలమ్మ, ములుగు ప్రాంత ప్రజలు ఈ స్థాయికి తీసుకొచ్చి సమ్మక కాబట్టి తల్లుల సేవలో ప్రజాసేవలో ఎల్లప్పుడు ఉంటాము తల్లుల గొప్ప కీర్తిని కించిత్ తగ్గకుండా ముందుకు తీసుకెళ్తాము ఈ చిన్న సమస్య లేకుండా గుడి నిర్మాణాన్ని పూర్తి చేస్తాము